వినియోగదారుల హక్కులపై ర్యాలీ

ప్రజాశక్తి- పెదబయలు :స్థానిక గిరిజన సంక్షేమ రెసిడెన్సిల్ బాలుర పాఠశాలలో సోమవారం వినియోగదారుల హక్కులపై ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డిఎస్ శంకర్ రావు ఆధ్వర్యంలో వినియోదారులు హక్కులు, చట్టాలపై కల్తీ వస్తువుల వినియోగం నష్టాలు ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ చేస్తున్న సంఘం సభ్యులు

మహిళా సెక్యూరిటీ గార్డ్లలకు ఉద్యోగ భద్రత కల్పించాలని..

ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి -పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకుల ఏకలవ్య పాఠశాలలు, కళాశాలలో పని చేస్తున్న ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులకు తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఏ ఎదుట ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.బాలదేవ్, ఎస్ ధర్మన్న పడాల్, ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా నాయకులు గంపరాయి సీతమ్మ, కిలో మమత, ముత్తంగి ప్రశాంతి, కె నిర్మల ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, 2022 ఆగస్టు 15 తేదీ నుండి సేవా సుప్రీమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా గురుకులం ఏకలవ్య పాఠశాలలు, కళాశాలలో సెక్యూరిటీ గార్డులుగా నియమించబడి విధులు నిర్వహిస్తున్నారన్నారు. టెండర్ కాంట్రాక్ట్ మారిందనే కారణంతో 60 మంది ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులను విధుల్లోనుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఈ పరిస్థితి పై జిల్లా కలెక్టర్ కు ఇప్పటికే ఆదివాసి మహిళ సెక్యూరిటీలు ఫిర్యాదు చేశారన్నారు. ఈ సమస్యపై పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని రెండు మార్లు కలిసారని ఈ మేరకు కాంట్రాక్టర్‌తో మాట్లాడతానని సమస్య పరిష్కారం చేస్తామని, హామీ ఇచ్చారని తెలిపారు. ఇంతలో ఎస్.ఆర్.ఆర్ అనే సంస్థ పేరుతో అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చి కొత్తవారిని నియమించి పంపిస్తున్నారని తెలిపారు. ఎంతో శ్రమించి బతుకుతెరువు కోసం ఎండ వాన చలి రాత్రి పగలనక కష్టపడి పని చేసిన ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెండర్ మారిన ప్రతిసారి ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్లను మార్చడం సరి కాదన్నారు. పాతవారినే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ విషయంపై ఐటిడిఏ పీవో అభిషేక్ కు ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డులు వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించి గురుకులం ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తామని తెలిపారన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులు ఎస్.కస్తూరి, ఎం బేబీ, బి.రాజమ్మ, గెమ్మెలి మంగమ్మ, పి.సావిత్రి, పి.నాగమణి, ఎం సింహాచలం, ఎం.గంగా భవాని, జి.నాగమణి సిహెచ్ జ్యోతి, పి.లక్ష్మి. బి.శాంతి, జి.హేమలత, కే నిర్మల, రాజేశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఐటిడిఏ పిఒ

క్రీడల అభివృద్ధికి చర్యలు : పిఒ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలను అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని 8 ఐటిడిఎల పరిధి ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు విశాఖపట్నంలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు రంపచోడవరం ఐటీడీఏ ద్వారా 35 మంది విద్యార్థులు రెండు బస్సులలో వెళ్లారు. వారిలో కాకవాడ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎం.లక్ష్మి జావిలిన్ త్రోలో ద్వితీయ స్థానం, కొత్తవీధి ఆశ్రమ పాఠశాలకు చెందిన కె.రాజారెడ్డి తృతీయ స్థానం, కాకవాడ ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఎం.యోగిత వ్యాచరచనలో తృతీయ స్థానం సాధించారు. వీరితో పాటు ఆటల పోటీలకు వెళ్లిన విద్యార్థులందరూ మెమోంటోలు, సర్టిఫికెట్లు పొందారు. వీరంతా సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ప్రాజెక్ట్ అధికారిని మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కె.తిరుపతిరావు, ఎ.బాలరాజు, సౌద్యలక్ష్మి, కె.పోతురాజు, పిఈటి ప్రసాద్, ఐటిడిఏ ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎంఈఓ కె.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు, తొలగింపు పక్కాగా చేయాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించ వద్దని నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. ఓటరు నమోదు, తొలగింపు ప్రక్రియ పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సబ్ కలెక్టర్లు, తహశీల్దారులతో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం -6, ఫారం- 7, ఫారం -8 ల పై సమీక్షించారు.అరకు వ్యాలీ నియోజక వర్గం లో ఫారం -6 లు 740, పాడేరు నియోజక వర్గంలో 1936, రంపచోడవరం నియోజక వర్గంలో 465 వెరసి 3141 పెండింగిలో ఉన్నాయని రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అరకు నియోజక వర్గంలో ఫారం 8లు 4515, పాడేరు నియోజకవర్గంలో 1805, రంపచోడవరం 1564 మొత్తం 7884 ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని రెండు రోజుల్లో పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. 6,7,8 ఫారాలను త్వరగా పరిష్కరించే విధంగా బూత్ స్థాయి అధికారులను ఆదేశించాలని అన్నారు. ఫోటో గ్రాఫ్, డెమోగ్రాఫ్‌లకు సంబంధించి ఒకే విధంగా ఉన్న ఎంట్రీల వివరాలను సంబంధిత ఓటర్లకు పంపించి వారి నుండి ఫారం-7లను సేకరించి 15 రోజుల్లోగా సవరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 537 జీరో నంబరు గృహాలలో 9140 మంది ఓటర్లు ఉన్నారని, వారి నుండి ఫారం 7లను సేకరించి సవరించాలని చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, పాడేరు, రంప చోడవం సబ్ కలెక్టర్లలు వి.అభిషేక్, శుభం బన్సల్, డి.ఆర్ఓ పి. అంబేద్కర్, కె.ఆర్.ఆర్ సి, ఎస్.డి.సి మురళి, 22 మండలాల తహశీల్దారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు

తులసిపాక ఆరోగ్య కేంద్రం ఆధ్యర్యాన కుటుంబ నియంత్రణపై చింతూరులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ఇద్దరు వద్దు - ఒకరు ముద్దు' 'అధిక సంతానం-ఆర్థిక భారం' అన్న నినాదాలతో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయం నుండి చింతూరు మెయిన్ సెంటర్, సిపిఎం ఆఫీస్ మీదుగా మెడికల్ కాలనీ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా తులసిపాక వైద్యాధికారి ఉదయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కాన్పు కాన్పుకు మధ్య 2 నుండి 3 సంవత్సరాలు దూరంగా ఉంటే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పురుషులకు కోత కుట్లు లేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సులువైనది, సురక్షితమైనదని, కేవలం ఐదు నిమిషాల్లో పూర్తవుతుందని, అపోహాలు వీడి భర్తగా బాధ్యతగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ ఆపరేషన్ వల్ల శరీర పటుత్వానికి, దాంపత్య జీవితానికి ఎలాంటి ఆటంకం రాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్, ఎంఎల్ఎస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీలో గిరిజన నేతరులకు నకిలీ ఎస్టి కుల దవీకరణ పత్రాలు జారీ చేసి ఉండడం పై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘం సమావేశం జరిగింది .ఈ సందర్భంగా సమస్యలపై సంఘం నాయకులు చర్చించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన 1/70 చట్టాన్ని ప్రతిష్టంగా అమలు పరచాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజన ప్రాంతంలో గిరిజన నేతలు అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు నాలుగున్నర ఏళ్ళు గడుస్తున్న ఇప్పటికీ గిరిజన స్పెషల్ డిఎస్సీ, ఐటీడీఏ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం పై వారు మండిపడ్డారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలో గిరిజన ప్రాంతంలో గిరిజన అభ్యర్థులతోనే పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో గిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో వందశాతం రిజర్వేషన్ కల్పించేందుకుగాను గతంలో కల్పించిన జీవో నెంబర్ 3 కు చట్టబద్ధత కల్పించి ,నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని చెప్పారు. తక్షణమే ఈ సమస్యలపై ఉన్నతాధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పి సురేష్ కుమార్ ,మండల నాయకులు రామచందర్, రామ్మూర్తి , దొంబు, కోటి బాబు, అచ్యుతరావు, సత్తిబాబు ,మోహన్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేతలు

అన్ని మండలాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అన్ని మండలాల్లోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, ఏడు మండలాల తహశీల్దార్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లతో ధాన్యం కొనుగోలుపై సోమవారం ప్రాజెక్ట్ అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రంపచోడవరం మండలంలో 6, మారేడుమిల్లిలో 1, దేవీపట్నంలో 4, గంగవరంలో 4, అడ్డతీగలలో 3, వై.రామవరంలో 4, రాజవొమ్మంగి మండలంలో 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వరి ధాన్యానికి ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 44 క్లస్టర్లను ఏర్పాటు చేశామని, ఆయా ధాన్యం కొలుగోలు కేంద్రంలో వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో జిపిఎస్ సిస్టం ఏర్పాటు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని జియో టాకింగ్ ద్వారా వాహనాలలో మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక చేసిన రైతు భరోసా కేంద్రాల్లో కూడా ధాన్యం కొలుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్‌కెవి చౌదరి, కె.సావిత్రి, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

గిరిజనులకు ఏం చేశారని మళ్లీ జగన్ కావాలి?

ప్రజాశక్తి- విఆర్.పురం

ఏజెన్సీలోని గిరిజనులకు వైసిపి ప్రభుత్వం ఏమి చేసిందని మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కావాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్, నాయకలు పులి బుజ్జి ప్రశ్నించారు. మండలంలోని రేఖపల్లిలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన చట్టాలను అమలు చేయనందుకా? ఆదివాసీ హక్కులను కాలరాస్తున్నందుకా? అభివృద్ధి పనులు శంకుస్థాపనలకే పరిమితం చేసినందుకా? పోడు భూములకు పట్టాలు ఇవ్వనందుకా? ఆదివాసీ గ్రామాలకు కరెంటు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించనందుకా? జిఒ 3ను అమలు చేయనందుకా? ఏళ్ల గడుస్తున్న డిఎస్‌సి తీయనందుకా? బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చినందుకా? పీసా, 1/70 చట్టాలను తుంగలో తొక్కినందుకా? ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఇవ్వనందుకా? భాషా వాలంటీర్లను తొలగించి కొండ రెడ్లకు విద్యను దూరం చేసినందుకా? పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం, ప్యాకేజీలు ఇవ్వనందుకా? ఎందుకు మళ్లీ జగన్ కావాలో వైసిపిలో ఉన్న గిరిజన నాయకులు ఆలోచించాలని హితవుపలికారు. ఈ సమావేశంలో సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్

రచ్చబండ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - అనంతగిరి: టోకురు పంచాయతీ పింపోడువలస గ్రామంలో నిర్మించిన నూతన రచ్చబండను స్థానిక సీపీఎం సర్పంచ్ కిల్లో, మోస్య మాజీ సర్పంచ్ దొన్ను, ఉప సర్పంచ్ గెమ్మెల, నర్సన్న లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోస్య మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిస్తుందన్నారు.పంచాయతీలో ఉన్న వనరులను ఉపయోగించుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీ సాధారణ నిధులతో పెంపుడువలస గ్రామంలో రచ్చబండ నిర్మించడం జరిగిందని తెలిపారు.రాయవలస గ్రామంలో గ్రావిటీ మంచినీటి సౌకర్యం కల్పించామని, చిట్టంపాడు గ్రామంలో రోడ్డు మరమ్మతులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సారా దొన్ను, సీపీఎం నాయకులు గెమ్మెల, దేవన్న వార్డు సభ్యులు గుజ్జెల ,పద్మ శిరగం, ప్రసాద్ గెమ్మెల, లక్ష్మణ్ ,సమర్డి ప్రసాద్ మాజీ వార్డు మెంబరు గుజ్జెల, గురుమూర్తి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- కొయ్యూరు

నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో గిరిజనులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఆ సమస్య పరిష్కారానికి అధికారులు, తాను నిరంతరం కృషి చేస్తున్నామని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. మండలంలోని మర్రివాడ గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన 20వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి ట్యాంకును ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఈ సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

రాష్ట్రంలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడపకూ చేరాయని పాడేరు శాసనసభ్యులు కొటగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. కొయ్యూరు మండలం శరవన్నపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి 250 గడపలను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భూముల రీ సర్వే ఒక విప్లవత్మకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మర్రివాడ సర్పంచ్ వంతల లక్ష్మి, శరవన్నపాలెం సర్పంచ్ కిముడు సత్యనారాయణ, ఎంపీటీసీ లోకుల సోమగాంధీ, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, వైసిపి నాయకులు బండి సుధాకర్, సుమర్ల సత్యవతి, అచ్యుత్, సుమ్మర్ల సూరిబాబు, గాడి సత్యనారాయణ, పొత్తూరు తాతారావు, జొరంగి రామారావు, గాడి అచ్చిరాజు, పాటి శేఖర్, లాలం శేఖర్, నరసింహ, దొని బాబ్జి, సడ్డా సావిత్రి, సర్పంచులు ఈ.సత్యనారాయణ, బాలకృష్ణ, కూడా రాజబాబు, ఉప సర్పంచ్‌లు పి.రాజుబాబు, త్రిమూర్తులు, కాళ్ల వనంబాబు, ఎంపిటిసిలు మల్లేశ్వరి, పుల్లయ్య, అప్పన్న, గజ్జయ్య దొర, కన్నారావు, అబ్దుల్, భీమరాజు, రామరాజు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నాయకులు, స్థానికులు

తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

తాగునీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్తు నిధులతో బోరుబావులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిపి సార్ల లలిత కుమారి తెలిపారు. మండలంలోని మారేడుమిల్లి గ్రామం గంగాలమ్మ వీధి, సిఎస్ఐ చర్చి వీధి, దొరల వీధి తదితర ప్రాంతాల్లో మంచి నీటి కొరత లేకుండా మూడు బోర్లు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. మండలంలో నీటి కోరత ఏర్పడితే తనకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బాలాజీ బాబు, వైసిపి మండల అధ్యక్షులు సత్తి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కొండ జాకబ్, కో ఆప్షన్ సభ్యులు గురుకు ధర్మరాజు, ఉపసర్పంచ్ వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరుబావి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రాజ్యాంగ విశిష్టతపై అవగాహన

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండల కేంద్రంలో మూడు రోడ్ల జంక్షన్ వద్ద సోమవారం భారత రాజ్యాంగ పై మండల" జైభీం ఆర్గనైజేషన్"ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. రాజ్యాంగం విలువ, హక్కులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సాగేని కోటేశ్వరరావు, ఎస్.నాగబ్బాయి, కిముడు కళ్యాణం, రైతు నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు డి.లక్ష్మణ్, రీమల కొండబాబు, ఎం.హరీష్, ఉపాధ్యాయులు సిహెచ్. కేశవరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐ సత్యనారాయణ బదిలీ

ప్రజాశక్తి-జి.మాడుగు:సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ బదిలీ అయ్యారు. మండలంలో గంజాయి నిర్మూలన, గిరిజనులకు విత్తనాల పంపిణీ చేస్తూ ప్రజల మన్ననలు పొందిన సీఐ సత్యనారాయణ ఆకస్మిక బదిలీ మండల వాసులలో ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయన స్థానంలో విశాఖపట్నంలో విధులు నిర్వహిస్తున్న రమేష్ జి మాడుగుల సిఐగా రానున్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ 2వ వార్డుకు చెందిన శృంగవరపు రాజేష్‌కు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం రూ.1.50లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ మేరకు సోమవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పట్టణ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వార్డు కౌన్సిలర్ సిరసపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చేపట్టాలని సోమవారం జనసేన పార్టీ నాయకులు ఆర్డీవో జయరాం, కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో గడిచిన రెండేళ్లుగా కాలువలలో పూడిక తీయలేదన్నారు. తొమ్మిది నెలలకు పైగా డ్రైనేజీలు శుభ్రం చేయలేదని తెలిపారు. దోమలతో ప్రజలు విష జ్వరాలు బారిన పడుతున్నారన్నారరు. ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, మాకవరపాలెం నాయకులు నమ్మి కొండలరావు పాల్గొన్నారు.

'విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అక్రమణదారులతో కుమ్మక్కై ప్రభుత్వ స్థలాలకు ఎల్పిసిలు మంజూరు మంజూరు చేసిన వీఆర్వోను సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ అధ్యక్షులు పులిగా రామ్మోహన్ మురళీ కోరారు. సోమవారం స్పందనలో ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మురళీ మాట్లాడుతూ, గొలుగొండ మండలం ద్వారకానగరంలో గెడ్డ పోరంబోకు స్థలం ఆక్రమణపై గత సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆ ఫిర్యాదుపై వివరాలు సేకరించి గొలుగొండ తహశీల్దార్ స్థలం ఆక్రమణక గురైందని నిర్ధారించారన్నారు. ప్రభుత్వ స్థలానికి ఎల్ పిసిలు మంజూరు చేసిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

డిఎస్‌పి వి.సుబ్బరాజు

ప్రజాశక్తి-మాడుగుల:సమాజంలో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి డిఎస్పి వి.సుబ్బరాజు కోరారు. సోమవారం మాడుగుల పోలీస్ స్టేషన్లో తనిఖీలు నిర్వహించిన ఆయన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటిపి లేదా తెలియని వారి దగ్గర నుండి ఎటువంటి ఫోన్, మెసేజ్ వచ్చినా స్పందించ వద్దని తెలిపారు. బ్యాంకు ఖాతాలో నగదు మాయం అయితే వెంటనే 1902 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు.గంజాయి పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, దీనికోసం ప్రత్యేకమైన బృందాన్ని ఏర్పాటు చేసి చెన్నై, భువనేశ్వర్, ఒరిస్సా రాష్ట్రా లలో నిందితుల కోసం సోదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాడుగుల పోలీస్ స్టేషన్ పరంగా 2021 నుండి 2023 వరకు రికార్డులు పరిశీలిస్తే క్రైమ్ రేట్ తగ్గిందని డీఎస్పీ తెలిపారు. ప్రతి ఒక్కరి సెల్ ఫోన్‌లో దిశ యాప్ ఉండటం ఎంతో ప్రయోజనకరమని డి.ఎస్.పి చెప్పారు. ఆయన వెంట సీఐ యం.తాతారావు, మాడుగుల ఎస్సై పి.దామోదర్ నాయుడు ఉన్నారు.

సిహెచ్‌డబ్ల్యుల సమస్యలపై పోరాటం

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో ఆశా వర్కర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న సిహెచ్‌డబ్ల్యూ వేతన వ్యత్యాసాలను తొలగించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ముందు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 4 వ రోజు సోమవారం కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో.సురేంద్ర మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, ఆశ వర్కర్లతో సమానంగా పని చేస్తున్నప్పటికీ ఇచ్చే జీతంలో సిహెచ్‌డబ్ల్యులకు 4వేలు ఆశా వర్కర్లకు 10వేలు వేతనం ఇస్తూ వ్యత్యాసం చూపడం తగదన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఇటువంటి వ్యత్యాసం లేదని, అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 750 మంది కమ్యూనిటీ వర్కర్లు మాత్రమే పొందుతున్న వేతనాల్లో అన్యాయానికి గురవుతున్నారని ఉన్నారు. వీరికి యూనిఫాం, సెల్ ఫోన్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని చెప్పారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఆదివాసీ గిరిజన సంఘం మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్రావు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం కిల్లో పార్వతమ్మ, టి మోదకొండమ్మ, జె సావిత్రి, కాంతమ్మ, నాగమణి కే చిన్ని, బి.లక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.

ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సుజాత సాల్మన్

ఆమ్ ఆద్మీ ఆవిర్భావ దినోత్సవంలో సజాత సాల్మన్‌ను సన్మానిస్తున్న ఆ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ :ఆమ్ ఆద్మీ పార్టీ అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎం.సుజాత సల్మాన్ ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించినట్లు అభ్యర్థిని సుజాత సల్మాన్ విలేకరులకు తెలిపారు.ఆమ్ ఆద్మీ పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం 26న విజయవాడ లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల వ్యవహారాల ఇంచార్జి మని నాయుడు ఏపీ స్టేట్ ఇంచార్జీ సీరా రమేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ 11వ ఆవిర్భావ సభలో తనను అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినట్లు ఆమె తెలిపారు. పార్టీకి కోసం విశేష కృషి చేసిన సుజాత సాల్మన్‌ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంఛార్జి కె. మని నాయుడు సన్మానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అరకు అసెంబ్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గా తనను పోటీ చేయాలని ప్రకటించినట్లు ఆమె అన్నారు. పాడేరు అసెంబ్లీలో గిరిజన హక్కుల కోసం పనిచేసే సోనాయి గంగరాజును పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించి కోఆర్డినేటర్ గా నియమించారని ఆమె అన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని భాధ్యతతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మరింత కష్ట పడి చేయాలన్నారు. తనకు సహకరించిన ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నాయకులకు, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జి నాయుడు, రాష్ట్ర కన్వీనర్ సిరా రమేష్, జోనల్ కమిటీ పట్టంలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాలు కిటకిట

ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్య క్షేత్రం మత్స్య గుండం మత్స్య లింగేశ్వర స్వామి దేవాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. తొలి పూజల్లో స్థానిక సర్పంచ్ మఠం శాంత కుమారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.జ్ఞాన సాగర్ అకాడమీ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం పంపిణి చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టీ అప్పారావు, వీఆర్పీ అల్లంగి బాలయ్య, వార్డు సభ్యులు పాంగి మత్స్య కొండ బాబు, మఠం సింహ చలం నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని జాతీయ రహదారిలోని జైపూర్ జంక్షన్ వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అరకులోయ నుంచి జైపూర్ జంక్షన్ మీదుగా ఒడిస్సా వెళ్లే ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఒడిస్సా రాష్ట్రం చెందిన గొల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ చేరుకొని క్షతగాత్రులను అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

సాగు నీటికి రైతుల మధ్య వివాదం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:సాగునీటికై రైతులు పోరాటం సాగిస్తున్న పరిస్థితి మండలంలో నెలకొంది. సోమవారం మండలంలోని వెంకటాపురం, కర్రివానిపాలెం రైతులు ధర్మవరం గ్రామం వద్ద వరహానదిలో నీటికై సమావేశం నిర్వహించారు.తమ గ్రామంలోని పంట పొట్ట దశలో ఎండిపోతున్నా తమకు నీరు రానివ్వకుండా చేస్తున్నారంటూ వెంకటాపురం గ్రామస్థులు ఆరోపించారు. ఏటిలో ఇసుక బస్తాలతో ఒడ్డు వేసి తమ గ్రామానికి తీసుకువెళ్ళేందుకు ఏర్పాటు చేయగా, కర్రివానిపాలెం గ్రామరైతులు అభ్యంతరం తెలిపారు. దీనిపై ఇరువర్గాల రైతులు వాదోపవాదాలు జరిగి ఒకదశలో ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పాయకరావుపేట సబ్ డివిజన్ ఇరిగేషన్ డిఈ జగదీష్ రాయవరం సెక్షన్ ఏఈ చిన్నారావులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. పల్లపు గ్రామాలైన వాకపాడు, పిట్లపాలెం, కర్రివానిపాలెం, ఉప్పరాపల్లి, వెంకటాపురం గ్రామాల పరిధిలో రెండు వేల ఎకరాలకు నీరు అవసరం ఉందన్నారు. ఈ ఐదు గ్రామాల రైతులకు నీటి లభ్యతను బట్టి ఎన్ని రోజులు కేటాయించాలని రైతుల సమక్షంలో నిర్ణయిస్తామని డిఈ జగదీష్ తెలిపారు. తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ఏడాది సాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. రైతులు సమన్వయం పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు అమలకంటి అబద్ధం, ఉప్పరపల్లి సర్పంచ్ శ్రీరాములు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ (విశాఖ కాపులుప్పాడ)లో ఆదివారం నిర్వహించిన సౌత్ రీజియన్ "భారత్ కో జానో" క్విజ్ పోటీల జూనియర్స్ విభాగంలో స్థానిక శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అజితేష్ త్రిపాఠీ (8వ తరగతి), కామిరెడ్డి గణేష్ పార్థు (7వ తరగతి) ద్వితీయ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ద్వితీయ స్థానం సాధించడం హర్షణీయమని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహారావు తెలిపారు. విద్యార్థులను విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో భోజనాలు ఏర్పాటు

ప్రజాశక్తి-చీడికాడ:అప్పలరాజుపురంలో లలితాదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్వీట్లు, భోజనాలను ఏర్పాటు చేశారు. మండలంలోని చనగోగడ గ్రామానికి చెందిన ప్రగడ వెంకట సాయి తన తండ్రి సంస్మరణ దినం సందర్భంగా సోమవారం వృద్ధులకు, వికలాంగులకు భోజనం, స్వీట్లు పంపిణీ చేశారు. రూ.1500 ఆర్థిక సహాయాన్ని వృద్ధాశ్రమ నిర్వాహకురాలు లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు వెంకట సాయి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు

ఇన్‌ఛార్జి వీసీకి అభినందనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సమతను ఎయు ఒఎస్‌డి ఆచార్య కె.కృష్ణమోహన్, సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎస్ఎన్.రాజు, పలువురు ఆచార్యులు, అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు సోమవారం అభినందించారు.

వేడుకల్లో పాల్గొన్న ఏకలవ్య ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముగిసిన బిర్సా ముండా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో బిర్సా ముండా జయంతోత్సవాలు సోమవారం నాడు ఘనంగా ముగిశాయి. ఈ నెల 15 నుండి 27వ తేదీ వరకూ ప్రతీరోజూ విద్యార్థులచే వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో భాగంగా ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు, జీవన శైలిపై వ్యాసరచన, పద్యపఠనం, చిత్రలేఖనం, లఘు నాటికలు తదితర కార్యక్రమాలు చేశారు. చివరిరోజు సోమవారం విద్యార్థులు వివిధ గిరిజన నృత్యాలతో అలరించారు. విద్యార్థులు స్వయంగా గిరిజన వంటకాలు చేసి ఉపాధ్యాయులకు వడ్డించారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.అరుణ కుమారి విప్లవ వీరుడు బీర్సా ముండా జీవిత చరిత్రను వివరిస్తూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందేలా ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - సీలేరు : కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని జికె.వీధి మండలం గుమ్మిరేవులు, దుప్పిలివాడ, సీలేరు, దారకొండ తదితర పంచాయతీల మాజీ సర్పంచ్‌లు అల్లంకి రాజు బాబురావు, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, మల్లు దొర, రాజు, రాంబాబు, గెన్ను పిలుపునిచ్చారు. సోమవారం ఐదు పంచాయతీల కాంగ్రెస్ నాయకులు సీలేరులో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రానున్న 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి చేయవలసిన పనులపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి జీకే వీధి మండల పరిధిలో ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పని చేయాలని కోరారు.

బందమామిడి గ్రామానికి బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలో బందమామిడి గ్రామానికి రాకపోకలు సాగించడానికి బ్రిడ్జి నిర్మాణం చేయాలని దళిత సమాజ సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బిఎన్.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బందమామిడి గ్రామంలో పర్యటించారు. రంపచోడవరం మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరం ఉన్న బందమామిడి గ్రామానికి చెందిన పిల్లలు చదువుకోడానికి వెళ్లాలన్న, రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా, తమ సమస్యలు చెప్పుకోవడానికి ఐటిడిఎ కార్యాలయానికి వెళ్లాలన్నా చుట్టూ ఐదు పది కిలోమీటర్ల తిరిగి వెళ్లవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాధుడే లేరని పేర్కొన్నారు. ఇప్పటికైనా చిన్న రోప్ బ్రిడ్జ్ అయినా నిర్మించాలని డిమాండ్ చేశారు.

రబీ పంటల ఈ-క్రాప్ నమోదు చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : రబీ సీజన్లో పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయాలని మండలం వ్యవసాయ అధికారి ఉమాదేవి అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్లో సాగులో ఉన్న వరి, మినుములు, పెసలు, రాజ్‌మా పంటల వివరాల నమోదుకు రైతులు పంట విస్తీర్ణం, పంట రకం, రైతు ఆధార్, పట్టా వివరాలతో సంబంధిత రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో రబీ సీజన్‌లో 312 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గాను 180 హెక్టార్లలో పంటలు సాగులో ఉన్నట్లు చెప్పారు. రాజ్‌మా పంట ఇన్సూరెన్స్ అందుబాటులో ఉందని చెప్పారు.

స్పందన దరఖాస్తులు సత్వర పరిష్కారం

సమస్యలను ఆలకిస్తున్న పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 54 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను పిఒతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ సిహెచ్. శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్ శాస్త్రి, ఏడియంహెచ్‌ఓ జి.ప్రకాశం, వెలుగు ఎపీడీ ఎ.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, సావిత్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎమ్‌డి.యూసఫ్, సుబ్బయ్య, పిహెచ్‌ఓ చిట్టిబాబు, డిటిడబ్ల్యూఓ ట్రైనింగ్ పి.తేజస్విని, డాక్టర్ ఇందిర, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, ఎఎంఒ సి.శ్రీహరి, జిసిసి సీనియర్ మేనేజర్ మురళి నాగ వెంకట రాజారెడ్డి, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.

అడ్డతీగల పోలీస్ స్టేషన్‌ను మ్యూజియంగా రూపొందిస్తాం

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి కేంద్రమైన అడ్డతీగల మండలం 'పైడిపుట్ట' గ్రామాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే పేర్కొన్నారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు పిఒకి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వాడపల్లి శేషాచార్యులు, కార్యవర్గ సభ్యులు దంగేటి సత్తిబాబు, లంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన దొంగలు

ప్రజాశక్తి- చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి సచివాలయం పరిధి నిమ్మలగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి అగ్రికల్చర్ త్రీ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి లోపల ఉన్న కాపర్ వైర్‌ను దొంగలు అపహరించారు. నిమ్మలగూడెం గ్రామానికి చెందిన చోడే శ్రీనుకు చెందిన 15 కెవిఏ ట్రాన్స్ఫార్మర్నును పగులకొట్టి వైన్డింగ్ వైర్లను ఎత్తుకెళ్లారు. వ్యవసాయనికి ఉపయోగించే ట్రాన్స్ఫార్మర్లు ఐదు లక్షల రూపాయలు ఉంటాయని ఈ విషయంపై స్థానిక చింతూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలియజేశారు.

అందంగా కనిపిస్తున్న పోలీస్ స్టేషన్

పోలీసు స్టేషన్‌కు కొత్త హంగులు

ప్రజాశక్తి - కొయ్యూరు

మండల కేంద్రంలోని కొయ్యూరు పోలీసు స్టేషన్ రూపు రేఖలు మారాయి. పోలీసు సిబ్బంది సహకారంతో ఎస్సై రాజారావు పోలీసు స్టేషన్‌కు రంగులు వేయించి సరికొత్త హంగులు తీసుకొచ్చారు. పోలీసు స్టేషన్ ఆవరణను శుభ్రం చేయించి, చదును చేసి వివిధ రకాల పూల మొక్కలను నాటారు. చాలా ఏళ్ల తర్వాత పోలీసు స్టేషన్ భవనానికి అందమైన రంగులు వేయించి ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పెయిటింగ్‌ను స్టేషన్ భవనంపై వేయించారు.

సిఐ స్వామినాయుడు బదిలీ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.స్వామినాయుడును రాజవొమ్మంగి సీఐగా బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొయ్యూరు సీఐగా స్వామినాయుడు సుమారు రెండున్నరేళ్ల పాటు సేవలు అందించారు. మండలంలో గంజాయి సాగు, రవాణా, సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మారుమూల గ్రామాల్లో సైతం సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. రాజవొమ్మంగి సీఐగా పనిచేసిన షేక్ బాజీలాల్ కొయ్యూరు సిఐగా వస్తున్నట్టు సమాచారం.

గంజాయి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి- కొయ్యూరు : ఆపరేషన్ పరివర్తనలో మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి మారుమూల గ్రామాలైన అన్నవరం, నల్లబిల్లి, గేదరెబ్బ గ్రామ శివారులో సాగు చేస్తున్న సుమారు 3 ఎకరాల గంజాయి తోటలను సిఐ స్వామినాయుడు, మంప ఎస్సై లోకేష్ కుమార్, సిబ్బంది సహాయంతో సోమవారం ధ్వంసం చేశారు. ఆనంతరం అన్నవరం, నల్లబిలి గ్రామాలలో స్థానికులతో సమావేశమై గంజాయి సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాడు-నేడుతో అంగన్వాడీ భవనాల నిర్మాణం

ప్రజాశక్తి-కొయ్యూరు : నాడు-నేడు పథకం ద్వారా రెండో విడతలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం, మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఐసీడీఎస్ సీడీపీవో విజయ కుమారి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నిధులు ఖర్చు చేసేందుకు మదర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో రాంబాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచి రాజు

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి కమ్మరితోట గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం దారకొండ సర్పంచి ఎన్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రహదారి సౌకర్యం లేక వర్షం వస్తే ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యే వారని, ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ ద్వారా మంజూరు చేసిన రూ.4 లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. రహదారి నిర్మాణం పూర్తయితే కమ్మరితోట గ్రామ ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. పంచాయతీ పరిధిలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి పంచాయితీ అభివృద్ధి జరిగెలా చర్యలు చేపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ మాడి రామన్న, వార్డు సభ్యులు కిలో ఆంజనేయులు, వైసిపి నాయకులు పిల్ల బుజ్జి, రెడ్డి మోహన్‌రావు, గ్రామస్తులు కె.ప్రసాద్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.



వీధుల్లో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు

సీలేరులో వీధి కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు నెల రోజులుగా స్వైర విహారం చేస్తున్నాయి. గిరిజనులు పెంచుకుంటున్న మేకలను మేకలపై దాడి చేసి భయానక వాతావరణ సృష్టిస్తున్నాయి. ఇటీవల ఏపీ జెన్కో ఇండోర్ స్టేడియం, జిమ్ము పరిసరాల్లో రెండు మేకలపై విడత విడతలుగా కుక్కలు దాడి చేయడంతో ఆ మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో మేకల యజమానులు నష్టపోయారు. వీధి కుక్కలను నియంత్రించకపోతే పిల్లలపైనా దాడి చేసే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వీధి కుక్కలు వలన ఎవరికీ హాని కలగకుండా పంచాయతీ సర్పంచ్ దుర్జు కార్యదర్శి శ్రీనివాస్ చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

గాయపడిన విద్యార్థికి ఐటిడిఎ అండ

ప్రజాశక్తి - కొయ్యూరు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి పొటుకూరి సాయి సంతోష్‌కు ఐటిడిఎ అండగా ఉంటుందని ప్రాజెక్టు అధికారి తెలియజేసినట్లు ఎటిడబ్ల్యుఒ క్రాంతికుమార్ తెలిపారు. సాయి సంతోష్ చికిత్స విషయాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకెళ్లామని, దీనికి ఆయన స్పందించి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందేలా చూస్తామని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూడా ఆదుకుంటామని పీవో హామీ ఇచ్చారని క్రాంతికుమార్ వెల్లడించారు.